గుడిమల్కాపూర్‌లో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: భారతదేశ సైనిక పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ ఒక చిన్న శాంపిల్ మాత్రమే అని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై శుక్రవారం గుడిమల్కాపూర్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు సైనికుల దుస్తులు ధరించి చేత తిరంగా జెండా పట్టుకొని అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గం కన్వీనర్ పవన్, అనిల్, సందీప్, సాయి తదితరులున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సంక్షేమం



మదన్ మోహన్‌ను సత్కరిస్తున్న మధుగౌడ్, వాసు ముదిరాజ్‌లు

అబిడ్స్: ఇందిరమ రాజ్యంలో పేద బడుగు వర్గాల సంక్షేమం కొనసాగుతుందని గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు మదన్ మోహన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. శుక్రవారం మాజీ కార్పొరేటర్ మధుగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాసు ముదిరాజ్ మదన్‌మోహన్‌ను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మదన్‌మోహన్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఉన్నత విద్యాభ్యాసంలో మైనార్టీలు ముందుండాలి



అనం జాఫర్‌ను అభినందిస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: ఉన్నత విద్యాభ్యాసంలో మైనార్టీలు ముందుండాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థిని అనం జాఫర్‌ను కలిసి విద్యారంగంలో ప్రకాశిస్తూనే ఉన్నారన్నారు. దాని విద్యార్థిని, ఎంఈడీ 4వ సెమిస్టర్ విద్యార్థిని యూజీసీ నెట్ జేఆర్ఎఫ్ పరీక్షలో అఖిల భారత 1వ, ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన ఆమెను కలిసి అభినందించారు. డాక్టర్ మొహమ్మద్ ముస్తఫా అలీ సర్వారీ తదితరులు పాల్గొన్నారు.

అబిడ్స్ ఏసీపీగా ప్రవీణ్ కుమార్



అబిడ్స్: అబిడ్స్ ఏసీపీగా పీ.ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా అబిడ్స్ ఏసీపీగా పనిచేసిన ఆకుల చంద్రశేఖర్ డీజీపీ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో నగరంలోని సీటీపీ ఏసీపీగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఉత్తమ పోలీసింగ్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: వైన్ షాప్ వద్ద యువకుడిపై కత్తితో దాడిచేసిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జంగమ్మెట్ ఖాద్రీ చమాన్ ప్రాంతానికి చెందిన వెల్డింగ్ పనిచేసే మహ్మద్ ఆమేర్ (25) రాజన్నబావి ప్రాంతంలోని సాయిబాలాజీ వైన్స్ వద్దకు శుక్రవారం రాత్రి 9 గంటలకు మద్యం సేవించేందుకు వచ్చాడు. మద్యం తాగుతున్న క్రమంలో గుర్తుతెలియని యువకుడు, అతనికి మధ్య గొడవ జరిగింది. కోపోద్రేక్తుడైన ఆ యువకుడు ఆమేర్ తల, ఛాతి భాగంలో కత్తితో దాడి చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని తన కారులోనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఎట్టకేలకు స్పందించారు..!

- అంబేడ్కర్ నగర్ బస్తీని సందర్శించిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు
- కొత్త పైపులైన్ ఏర్పాటుకు అధికారుల అంగీకారం
- పూడికతీత పనులు చేపట్టిన సిబ్బంది
- 15 రోజుల్లో నిధుల మంజూరు.. ఆ వెంటనే పనుల ప్రారంభం

సాక్షి


ఎన్నాళ్లిలా..?

సాక్షి ఎఫెక్ట్..



బస్తీని సందర్శించి పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు



డ్రైనేజీ పూడికతీత పనులు చేస్తున్న సిబ్బంది

చార్మినార్: ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు శుక్రవారం స్పందించారు. గత కొన్నాళ్లుగా ఫలక్‌నుమా నాగులబండలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నగర్ బస్తీలో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను పరిశీలించారు. ఇప్పటికే డ్రైనేజీ పైపులైన్ అస్తవ్యస్తంగా మారడంతో కొత్తగా పైపులైన్ వేయాలని అంబేడ్కర్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు సంబంధిత జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. కొత్తగా పైపులైన్ వేసిన అనంతరం సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని వారు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో ఈ నెల 16న 'ఎన్నాళ్లిలా..?' అంటూ 'సాక్షి' దిన పత్రికలో ప్రత్యేక కథనాన్ని ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో స్పందించిన జీహెచ్‌ఎంసీ చాంద్రాయణగుట్ట సర్కిల్–8 ఈఈ సలావుద్దీన్, డీఈ ప్రశాంత్, ఏఈ మహేష్ తదితరుల ఇంజినీరింగ్ విభాగం అధికారుల బృందం శుక్రవారం బస్తీని సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. అంతేకాకుండా పొంగిపొర్లుతున్న మురుగునీటిని తొలగించి పూడికతీత పనులు చేపట్టారు. రాబోయే 15 రోజుల్లో కొత్త పైపులైన్ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేసి ఆ వెంటనే పనులను ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు తమకు హామీ ఇచ్చినట్లు అంబేడ్కర్ నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

రమణీయం.. రంగనాథ స్వామి రథోత్సవం







రథోత్సవంలో పాల్గొన్న వేదపండితులు

జియాగూడ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా జియాగూడ రంగనాథ స్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో రథోత్సవానికి ముందు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హోమం, బలి, హారతుల అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి శేషాచారి, ట్రస్టీ ఎస్టీ చారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ బట్టా చార్యులు, బద్రినాథ్ చార్యులు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాజాసింగ్, ఏసీపీ కిరణ్ కుమార్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ నాయకులు ఉమామహేందర్, గూడుమని శంకర్ తదితరులు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజాసింగ్

జియాగూడ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట రహింపురా అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం సత్య సుందర్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మెడిసిటీ ఆసుపత్రి సహకారంతో సత్య సుందర్ ఫౌండేషన్ పేద బడుగు వర్గాల కోసం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. వివిధ విభాగాల్లో అన్ని వైద్య సేవలు ఉచితంగా అందించడంతో పేద ప్రజలకు ఈ మెగా వైద్య శిబిరం ఒక వరంగా మారిందన్నారు. అనంతరం సత్య సుందర్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం నిరంతరం ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గుండె పరీక్షలు, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు, చిన్న పిల్లలు, మహిళలు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేలాది మందికి ఉచిత వైద్య సేవలు నిరంతరం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యాక్రమంలో బద్రినాథ్ సింగ్, శ్రీధర్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వర్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



లింగయ్యను సన్మానిస్తున్న మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ, కేఆర్.రాజ్‌కుమార్

అబిడ్స్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య పేర్కొన్నారు. శుక్రవారం టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్, టీఎన్జీఓ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం అధ్యక్షుడు కేఆర్. రాజ్‌కుమార్ లింగయ్యను ఘనంగా సత్కరించారు. అనంతరం స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ..ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఫక్రుద్దీన్, అశోక్, రమేష్, సుదర్శన్, దిలీప్ కుమార్, శ్రీనివాస్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జాతీయ సబ్ జూనియర్ రోయింగ్ చాంపియన్‌షిప్

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నగరం మరో మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతుంది. మే 27 నుంచి 31 తేదీ వరకు హుస్సేన్ సాగర్ లేక్‌లో 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. అండర్–13, అండర్–15 బాలికలు, బాలురు విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి దాదాపు 350 మంది రోయర్లు పాల్గొనబోతున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీ స్టేడియంలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ఏడాది కాలంగా రాష్ట్రంలో ఉన్న అన్ని క్రీడా మైదానాలు క్రీడాకారులతో కళకళలాడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రోయింగ్ కోచ్ ఇస్మాయిల్, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్ సుజాత మమత, అనిత, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ ఎన్‌కే గోకుల్, అసిస్టెంట్ డైరెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. మక్కా మసీదులోకి వచ్చే ముస్లింలను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరం మసీదులోకి అనుమతించారు. ఈ సామూహిక ప్రార్థనల్లో పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ, మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలలు పాల్గొన్నారు. ప్రార్థనల సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

డ్రైనేజీ సమస్యకు చెక్



డ్రైనేజీకి మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శాలిబండ: ఖాజీపురాలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటి సమస్యపై 'డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి'అనే శీర్షికతో ఈ నెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన వార్త కథనానికి శుక్రవారం సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులను చేపట్టారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్

చాంద్రాయణగుట్ట: ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దుండగులను శాలిబండ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురా ప్రాంతానికి చెందిన అబ్దుల్ వసీం(41), బండ్లగూడకు చెందిన అబ్దుల్ వహీద్(42)లు స్నేహితులు. తాము చేసే పనులకు వచ్చే వేతనం సరిపోక కుటుంబ పోషణ భారం కావడం, ఆపై చెడు అలవాట్లకు బానిసవ్వడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వహీద్ బంధువు మహ్మద్ ఖాలేద్ ఇంటి తాళం పగులకొట్టి అల్మారాలో దాచిన బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి కదలికలను గుర్తించిన దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, శాలిబండ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్‌ల బృందం సంయుక్తంగా దాడులు చేసి శుక్రవారం అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి రూ.1.6 లక్షల విలువైన 13.43 గ్రాముల బంగారం, 37.64 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు



గోల్కొండ: విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని రిసాల బజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ అన్నారు. గోల్కొండ ఖైరతాబాద్–1, 2, షేక్‌పేట్ మండలాలకు చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయన్నారు. ప్రాథమిక తరగతుల్లోనే విద్యార్థుల ప్రతిభకు సానబెట్టే ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మరింత రాటుతేలుతారన్నారు. గతంతో పోలిస్తే నేడు విద్యాబోధనలో ఎన్నో మార్పులు వస్తున్నాయని ఆమె అన్నారు. ఈ మార్పులను అందిపుచ్చుకున్న వారే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయ సిబ్బంది జాన్, జుకేర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాహుఫ్‌రెహాన్, 140 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీ రమణాచారి సేవలు అందరికీ ఆదర్శనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యా శంకర భారతీ మహా స్వామి, హరీష్ రావు, రమణాచారి

నాంపల్లి: టీటీడీ కార్యనిర్వాహణాధికారిగా డాక్టర్ కేవీ రమణాచారి తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి రచించిన అసాధ్యాలను సుసాధ్యాలు చేసిన అద్భుత సత్యాల హారం 'హరే శ్రీనివాస'గ్రంథావిష్కరణ జరిగింది. పుష్పగిరి పీఠాధిపతులు, జగద్గురువులు అభినవోద్దండ విద్యా శంకర భారతీ మహాస్వామి ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం దూరదర్శన్–ఢిల్లీ పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు అధ్యక్షతన జరిగిన సభకు విశిష్ట అతిథిగా హరీష్‌రావు మాట్లాడుతూ..డాక్టర్ కేవీ రమణాచారి కళాకారుల పక్షపాతి అని అన్నారు. అనంతరం నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా పాలక వర్గ సభ్యులు జి.వల్లీశ్వర్ గ్రంథ సమీక్ష చేశారు. గౌరవ అతిథిగా ఆధ్యాత్మిక వేత్త ఆచార్య శలాక రఘునాథ శర్మ, తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శోభారాజు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో డాక్టర్ శోభారాజు బృందంచే అన్నమయ్య సంకీర్తనలు అలంరింపజేశాయి.

గోల్కొండ బోనాలకు అందరి సహకారం అవసరం



గోల్కొండ కోటలో రాజు వస్తాద్ తదితరులు

గోల్కొండ: ఈ ఏడాది జరిగే గోల్కొండ కోట బోనాలకు అందరి సహకారం అవసరమని దేవి ఉపాసకులు ఎస్.రాజువస్తాద్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ కోటలో జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ కార్యనిర్వహణ అధికారి సలహాలు, సూచనల మేరకు బోనాల ఉత్సవాలకు సహకరిస్తామన్నారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా బోనాలు విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అయితే కొందరు కోటపై కేవలం జగదాంబిక అమ్మవారి ఆలయం ఒక్కటే ఉందని ప్రచారం చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సరి కాదని మహంకాళి అమ్మవారు కూడా ఇక్కడే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్ చారి తదితరులున్నారు.

గోల్కొండ కోట బోనాల కమిటీ ప్రమాణ స్వీకారం



కోటలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

గోల్కొండ: అందరి సహకారంతో ఈ సంవత్సరం జరిగే గోల్కొండ కోట బోనాలు విజయవంతం చేస్తామని గోల్కొండ జగదాంబిక మహంకాళీ ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత అన్నారు. గోల్కొండ కోట బోనాలకు దేవాదాయ శాఖ వారు బోనాల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ వారిచే ఆమె శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోల్కొండ కోటలో జరిగే బోనాలు తెలంగాణకే తలమానికం లాంటివన్నారు. రాష్ట్ర పండుగ అయిన బోనాలు మొట్టమొదటిగా ప్రారంభం అయ్యేది గోల్కొండ కోట నుంచే అని చివరగా ముగిసేది ఇక్కడే అని ఆమె అన్నారు. కోటలోని అమ్మవారికి మొత్తం 9 పూజలు జరుగుతాయని అమ్మవారి దర్శనానికి బోనం పూజ జరిగే రోజుల్లో లక్షలాదిగా భక్తులు తరలివస్తారన్నారు. అందరి సహకారంతో బోనాలను విజయవంతం చేస్తామన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంటిబాబు చైర్మన్‌గా, కమిటీ సభ్యులుగా నాగలపల్లి శ్రీకాంత్, సంతోష్‌గౌడ్, డి.అనిత, ఆకుల ప్రదీప్‌కుమార్, ఎస్.జే.యాదగిరి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, ఆకుల చంద్రశేఖర్, పి.శ్రీనివాస్, వినోద్‌సింగ్, హేమలత తదితరులున్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న అబ్దుల్ జావీద్ పాషా

సంతోష్‌నగర్: నిర్మాణ కార్మికులు తమ హక్కులు, సంక్షేమానికి సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావీద్ పాషా అన్నారు. చంపాపేట్‌లోని ట్విన్ టవర్స్‌లో శుక్రవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఐ.ఎస్.సదన్ పోలీసుల పర్యవేక్షణలో నిర్మాణ కార్మికులకు చట్టపరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..కార్మికులు తమకు కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉంటే వాటిని నిజంగా ప్రయోజనం పొందగలమన్నారు. ఏవైనా చట్టపరమైన సమస్యలను ఎదుర్కొంటున్న కార్మికులు సహాయం కోసం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం కార్మికులకు కల్పించిన హక్కులను ఆయన వివరించారు. కార్మికులు వివిధ పథకాల కింద ప్రయోజనాలను పొందడానికి సంబంధిత ప్రభుత్వ విభాగాలలో నమోదు చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు, బీమా కవరేజీని పొందడానికి ప్రతి కార్మికుడు ఈ–శ్రమ్ కార్డును పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ సత్యనారాయణ రాజు, ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు, ఎస్సై విజయ్ కుమార్, సైట్ ఇంజనీర్ జె.డి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ శిబిరంలో కోర్సు డైరెక్టర్ దశరథ్, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోర్సు డైరెక్టర్ దశరథ్ సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు నిర్వహిస్తున్న మండల్ లేవల్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో శుక్రవారం దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని తమ ఆటా, పాటలతో అలరించారు. గత నాలుగు రోజులుగా బర్షన్‌షా జీహెచ్‌ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమంలో పలు మండలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరై తమ ప్రతిభా పాటవాలను కనబరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో అంధుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శంకర్, లింగం, రమాదేవి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌గా రాఘవేందర్



చార్మినార్: ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌గా గోపిశెట్టి రాఘవేందర్‌ను అక్కన్న మాదన్న ఆలయ కమిటీ నామినేట్ చేసింది. శుక్రవారం సాయంత్రం అక్కన్న మాదన్న ఆలయంలో ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రాఘవేందర్‌ను ఆలయ కమిటీ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జగ్మోహన్ కపూర్..

అక్కన్న మాదన్న ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జగ్మోహన్ కపూర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారుగా రామ్‌దేవ్ అగర్వాల్, కార్యదర్శిగా కె.దత్తాత్రయ, కోశాధికారిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, డీఆర్ ప్రభా కర్, వినోద్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా విజయ్‌కుమార్, జోగిందర్ సింగ్, జి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్పీ క్రాంతి కుమార్, సభ్యులు దినేష్, రమేష్, రాజు, రామ్‌సింగ్, రవీందర్ చారి ఎంపికయ్యారు.